జీతం రూ.12 వేలు..
ఇచ్చేది రూ.6 వేలు 7

బాలికపై లైంగికదాడి 7
దర్యాప్తు చేస్తున్న పటాన్‌చెరు పోలీసులు

దళిత స్పీకర్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అవమానించారు

సంగారెడ్డిలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు


సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంగారెడ్డి క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శాసనసభ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు అవమానించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సంగారెడ్డి పట్టణంలో ఆదివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. దళితులను మోసం చేసిన పార్టీగా బీఆర్‌ఎస్ నిలిచిపోతుందని విమర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి చేర్యాల్ ఆంజనేయులు, తోపాజీ అనంతకిషన్, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల అధ్యక్షుడు మోతీలాల్, సిద్దన్న, బుచ్చిరాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్, శ్రీకాంత్, యాదగిరి, బాలు, నరేన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డి పట్టణంలో కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. మార్చి రెండోవారంలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతల కంటే రెండు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత 41 డిగ్రీలకు చేరడంతో 9 గంటల నుంచే ఎండ సుర్రుమంటున్నది. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి.



భానుడి భగభగ..

41 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత

సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో నమోదు ● ఉమ్మడి జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్



మెదక్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): భానుడు భగ్గుమంటున్నాడు. మార్చి రెండో వారంలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లా దామరంచలో 40.9 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా హత్నూర 40.6 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే రెండు డిగ్రీలు అధికమని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న పలు మండలాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.

ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా..

సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో అత్యధికంగా 41 డిగ్రీలు, పోతారెడ్డిపేట 40.9, నారాయణరావుపేట 40.6, దౌల్తాబాద్ 40.4, చిట్యాల 40.2, సిద్దిపేట 40.1, మెదక్ జిల్లా దామరంచ 40.9, కౌడిపల్లి, చిన్నశంకరంపేట 40.8, కొల్చారం, అల్లాదుర్గం 40.6, రేగోడ్ 40.4, కాగజ్‌మద్దూర్ 40.3, శివ్వంపేట 40.1, సంగారెడ్డి జిల్లా హత్నూర, వట్‌పల్లి 40.6, పల్వట్ల 40.4, చౌట్కూర్ 40.3 దిగ్వాల్ 40.2, అల్గోల్ 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.






ఎండకు కోహీర్‌లో నిర్మానుష్యమైన రోడ్డు


మంబోజిపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

వేసవిలో నిరంతర విద్యుత్

కార్యాచరణ సిద్ధం : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. మంబోజిపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్ల గురించి ఎస్ఈ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సాంకేతిక అంశాల్లో లోపాలు ఉంటే వెంటనే సరి చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్లు 126 ఉన్నాయని, వాటి పరిధిలో ప్రతీ రోజు విద్యుత్ వినియోగం నమోదు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, పారిశ్రామిక, గృహ వినియోదారులకు అంతరాయం లేకుండా 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని సూచించారు.

'అగ్నివీర్'కు దరఖాస్తులు

భారత సైన్యంలో 'అగ్నివీర్'ల నియామకానికి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 12 నుంచి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎన్‌సీసీ, ఐటీఐ, డిప్లమో అభ్యర్థులకు బోనస్ మార్కులు ఉంటాయన్నారు. తొలి దశలో రాత పరీక్ష, మలిదశలో శారీరకదారుఢ్య పరీక్షలు ఉంటాయన్నారు. వయసు 15-21 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. కొన్ని ట్రేడ్లకు కనీస విద్యార్హత 8వ తరగతి, కాగా.. మరికొన్నింటికి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు.


ఏడుపాయలలో ఎండలోనే అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) గర్భాలయంలో వనదుర్గామాత

ఇక్కట్ల మధ్యనే దుర్గమ్మ దర్శనం

● ఏడుపాయలలో ఎండకు భక్తుల అవస్థ ● కనిపించని రక్షణ ఏర్పాట్లు

పాపన్నపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పైన ఎండ.. కింద మండుతున్న సిమెంటురోడ్డు.. చుట్టూ మంజీరా పారుతున్నా గొంతు తడుపుకుందామంటే గుక్కెడు నీళ్లు కనపించక ఏడుపాయల వనదుర్గా మాత ఆలయానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. సెలవు దినం కావడంతో ఆదివారం వేలాదిగా భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు తరలివచ్చారు. ప్రతీఏటా వేసవిలో రాజగోపురం నుంచి ఆలయం వరకు నేలపై మ్యాట్ వేసి నీళ్లతో తడుపుతుంటారు. ఎండ నుంచి రక్షణ కోసం తడకల పందిళ్లు వేస్తుంటారు. కానీ, ఈసారి అలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు మండుటెండలో బొబ్బలెక్కిన కాళ్లతోనే దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. ఆలయం సమీపంలో తాగునీరు కూడా లేకపోవడంతో గొంతెండిపోతున్నదని వాపోయారు. సమస్యలు చెప్పుకుందామంటే ఈవో చంద్రశేఖర్ అందుబాటులో లేరని, పట్టించుకునేవారే కనిపించలేదని భక్తులు వాపోయారు. అంతకుముందు అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ అమ్మవారికి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్‌కు దూరంగా ఉండాలి

మోసపూరిత యాప్స్‌ను ప్రమోట్ చేయొద్దు : సంగారెడ్డి ఎస్పీ


సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యాప్స్‌లో బెట్టింగ్‌లకు పాల్పడినా, ఆన్‌లైన్ గేమ్స్ ఆడినా, ప్రోత్సాహించినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. యువత, విద్యార్థులు బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు అలవాటుపడి, సైబర్ మోసగాళ్ల పన్నిన ఉచ్చులో పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో ఈ యాప్స్‌కు బానిసలుగా మారుతున్నారని అన్నారు. కొందరు సోషల్ మీడియాలో ఈ యాప్స్‌ను ప్రోత్సహించడంతో యువతలో ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. బెట్టింగ్‌లను కట్టడి చేయడానికి జిల్లా పోలీస్‌శాఖ ఆధునిక సాంకేతికత సహాయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని తెలిపారు. బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా వేదికగా ఎవరిపైనా ప్రచారం చేస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ గేమింగ్ మాటున ప్రమాదకర మాల్ వేర్ ఉందని, ఫేక్ లింక్స్‌తో వ్యక్తి గత సమాచారం, అకౌంట్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే 100 నంబర్‌కు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (సోమవారం సాయంత్రం)
సహర్: 5:00 (మంగళవారం ఉదయం)

కుస్తీ పోటీ.. హోరాహోరీ

ముగిసిన రడగంబ మాత జాతర


కుస్తీలో పోటీపడుతున్న మల్లయోధులు

నాగల్‌గిద్ద, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇరక్‌పల్లిలో రడగంబ మాత జాతర ఉత్సవాలు రెండోరోజు అట్టహాసంగా కొసాగాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుస్తీ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీపడ్డారు. పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు మాజీ సర్పంచు విఠల్‌రావు, ఖేడ్ నాయబ్ తహసీల్దార్ రాజుపాటిల్, గ్రామపెద్దలు నగదు బహుమతులను అందజేశారు.

తవ్వేయ్.. అమ్మేయ్..

● జిన్నారం మండలంలో జోరుగా మట్టి దందా
● గుల్లవుతున్న ప్రభుత్వ భూములు, కుంటలు
● అక్రమార్కులకు సిరులు.. ప్రభుత్వ ఆదాయానికి గండి 7

నీడ లేదు.. నీరు కరువు

● పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించని యంత్రాంగం
● ఎండలోనే ఉపాధిహామీ పనులు 7



పౌల్ట్రీ..పల్టీ

గజ్వేల్ నియోజకవర్గంలో 2 లక్షల కోళ్లు మృత్యువాత

వింత వ్యాధితో మరణిస్తున్న వైనం

నష్టాల బారిన పౌల్ట్రీ రంగం

గజ్వేల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పరిధిలో దాదాపు రెండు లక్షల కోళ్లు మరణించినట్లు తెలుస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోనే గజ్వేల్‌లో మొదటగా పౌల్ట్రీ ఇండస్ట్రీ ప్రారంభమైంది. జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌కు చెందిన కొందరితో పాటు సిద్దిపేటకు చెందిన పలువురు దాదాపు 30 ఏళ్ల క్రితం తొలి పౌల్ట్రీ ఇండస్ట్రీని తీసుకువచ్చారు. పౌల్ట్రీ రాష్ట్రంలో ప్రస్తుతం కీలక ఇండస్ట్రీగా మారింది. అయితే, గతంలో ఎన్నడూ లేనివిధంగా కోళ్లకు వింత వింత రోగాలు వచ్చి మృతిచెందుతుండడంతో పౌల్ట్రీ యజమానుల తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఇప్పటికే గజ్వేల్ పరిధిలో దాదాపు రెండు లక్షల కోట్లు మృత్యువాత పడినట్లు పౌల్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. పది కోళ్లను పరిశీలిస్తే పదింటికి పది రకాల జబ్బులు వచ్చాయని, ఏ జబ్బుకు చికిత్స అందించాలో తెలియక తలలు పట్టుకున్నామని, చివరికి నష్టపోవాల్సి వచ్చిందని పౌల్ట్రీఫామ్ యజమానులు వాపోతున్నారు. రాయపోల్ మండలం రామారంలో నరేందర్‌రెడ్డి ఫామ్‌లో రెండు రోజులుగా 4 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ స్థాయిలో మరణిస్తున్నా పశువైద్యాధికారులు పట్టించుకోలేదని పౌల్ట్రీ యజమానులు వాపోతున్నారు.

కోలుకోవడం కష్టమే...

పరిస్థితి ఇలాగే కొనసాగితే కోళ్ల పరిశ్రమ ఆరు నెలల నుంచి ఏడాది వరకు కోలుకునేది కష్టమేనని పౌల్ట్రీ నిర్వాహకులు చెబుతున్నారు. గుడ్లకు సైతం మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ భారీగా పడిపోయింది. దీంతో అటు లేయర్ ఫామ్స్ సైతం మూతబడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మొక్కజొన్నలను సాగు చేసే రైతులకు పెద్ద ముప్పే పొంచి ఉంది. మక్కల ధర భారీగా పడిపోయే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

'రోడ్డు పనులు ప్రారంభించాలి'

చిలప్‌చెడ్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గంగారం నుంచి ఫైజాబాద్ వరకు గల రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టి మాట్లాడారు. గంగారం, అజ్జమర్రి, బండాపోతుగల్, ఫైజాబాద్ గ్రామాలను కలుపుతూ పోయే రోడ్డు అధ్వాన స్థితిలో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశం, శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.





















ఆర్టీసీ బస్సు, కారు ఢీ

● 14 మందికి గాయాలు



మెదక్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా రామయంపేట బైపాస్‌లో ఆర్టీసీ బస్సు, కారు ఢీకొంది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో 14 మంది గాయపడ్డారు. నిర్మల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును మూలమలుపులో కామారెడ్డి డిపో బస్సు బలంగా ఢీకొన్నది. బస్సులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందితో పాటు కారులోని ఐదుగురికి గాయాలయ్యాయి. వెంటనే అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది బాధితులను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎస్ఐ బాలరాజ్, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత రాహుల్ అక్కడి చేరుకొని మిగతా ప్రయాణికులను ఇతర బస్సులు ఎక్కించి పంపారు. ఈ ఘటనతో అరగంటపాటు హైవేపై ట్రాఫిక్ జామ్ కాగా పోలీసులు వాహనాలను క్లియర్ చేశారు.

చోరీకి వచ్చి.. విద్యుదాఘాతంతో మృతి


సంగమేష్ మృతదేహం

జోగిపేట, మార్చి16 (ఆంధ్రజ్యోతి): చోరీకి వచ్చిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన జోగిపేట శివారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేటకు చెందిన బుడగ జంగాల సంగమేష్ గ్రామ శివారలోని విద్యుత్ కేబుల్ వైర్లు చోరీ చేసేందుకు వచ్చి ప్రమాదమశాత్తు విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక రైతుల సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న సీఐ అనిల్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

పాపన్నపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లికి చెందిన జాల కిషనమ్మ(66) ఈ నెల 12 న ఇంట్లోకి వెళ్తుండగా మెట్లపై నీరు ఉండటంతో జారి కింద పడింది. తలకు బలమైన గాయం కావడంతో మొదట మెదక్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కొడుకు ఏసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి..


అమర్ సింగ్ మృతదేహం

చేగుంట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చేగుంట శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ చైత్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం లక్నో జిల్లా వి.గొండ గ్రామానికి చెందిన అమర్ సింగ్ (35) చేగుంట శివారులోని జీవిక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి చేగుంట గ్రామ శివారులోని ఊర చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కర్రలతో మూకుమ్మడి దాడి

● ఆసుపత్రి పాలైన బాధితుడు


చికిత్స పొందుతున్న మొగులయ్య

హత్నూర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిత్తు బొత్తు ఆటను అడ్డుకున్న వ్యక్తిపై కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేసి గాయ పర్చిన సంఘటన హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరిపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఆ గ్రామ శివారులోని మల్లారెడ్డి కుంట సమీపంలో కొందరు వ్యక్తులతో కలిసి ఈ నెల 14న హోలీ పండగ రోజు చిత్తు బొత్తు ఆట ఆడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన పార్వత మొల్ల మొగులయ్య వీరి అడ్డుకునే ప్రయత్నం చేసే క్రమంలో అక్కడే ఉన్న పూల శంకర్‌తో గొడవ జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న శంకర్ కుటుంబీకులు మరి కొందరు మొగులయ్యపై మూకుమ్మడిగా దాడి చేసి కాళ్లతో తన్నుతూ.. కర్రలతో కొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మొగులయ్య ఆసుపత్రిలో చికిత్స పొందున్నాడు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదని బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.


మొగులయ్యపై దాడి చేస్తున్న దృశ్యం

లారీ,ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

మునిపల్లి, మార్చి16 (ఆంధ్రజ్యోతి) : లారీ, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి కంకోల్ పై ఓవర్ (బ్రిడ్జి) వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన సుల్తానా, బిస్మల్లా తన కుటుంబ సభ్యులు జహీరాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు ఆటోలో వెళ్తున్నారు. మునిపల్లి మండలం కంకోల్ (65వ జాతీయ రహదారి) పై బ్రిడ్జివద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలోని ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని సదాశివపేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లియర్ చేశారు.





నీడ లేదు.. నీరు కరువు

ఉపాధిహామీ పని ప్రదేశాల్లో వసతులు లేక ఇబ్బందులు

కోహీర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సరైన వసతులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిలువ నీడ, తాగేందుకు నీరు లేక తల్లడిల్లుతున్నారు. టెంట్లతో నీడ, తాగునీటి వసతి కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఎండ, వడగాల్పులు, ఉక్కపోతతో కూలీలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రస్తుతం కోహీర్ మండలంలో సుమారు 2 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్నందున పనికి వెళ్లే కూలీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టెంట్లు అందించి కూలీలకు ఎండ నుంచి ఉపశమనం కల్పించాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా పని ప్రదేశాల్లో నేల గట్టిగా ఉండటంతో భూమిని తడిపేందుకు ట్యాంకర్లతో నీరు పట్టే వెసులు బాటు ఉన్నప్పటికీ అలా చేయడం లేదు కూలీలు ఆరోపిస్తున్నారు. పని సమయంలో కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స అందించేందుకు అయోడిన్, బ్యాండేజి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కొన్ని రకాల మాత్రలతో కూడి కిట్లు సమకూర్చాలి. కానీ ఎనిమిదేళ్లుగా వీటిని పంపిణీ చేయడం లేదు.





మారథాన్-2025 పోస్టర్‌ను విడుదల చేస్తున్న డైరెక్టర్ బీఎస్ మూర్తి

రన్నర్ ఆఫ్ మారథాన్-2025కు దరఖాస్తుల ఆహ్వానం

కంది, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సాహించడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)లో నవంబరు 30న రన్నర్స్ హాఫ్ మారథాన్-2025 2వ ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లు ఆదివారం ఐఐటీహెచ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అధ్యాపక బృందంతో కలిసి విడుదల చేశారు. ఇందులో బహుళ రేస్ విభాగాలు ఉన్నాయి. ఈ మారథాన్‌కు దేశంలోని వివిధ రాష్ట్రాలు, నగరాల నుంచి ఫిట్‌నెస్ ఔత్సాహికులు, రన్నర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారు. పాల్గొనాలనుకునే వారు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మారథాన్‌లో 5కే రన్, 10కే రన్, మారథాన్‌లతో పాటు ఫన్‌రన్ ఈవెంట్‌లు ఉంటాయి. విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు, పతకాలు, బహుమతులు అందిచనున్నారు. ఈ రన్నర్స్ ఆఫ్ మారథాన్ అకాడమిక్ ఎక్సలెన్స్‌తో పాటు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.

దత్తగిరి ఆశ్రమంలో పూజలు

ఝరాసంగం, మార్చి16 (ఆంధ్రజ్యోతి) : మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కే.కేశవరావు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన స్వామి వారి మాస అమరథితి కార్యక్రమానికి ఆయన హాజరుకాగా, ఆశ్రమ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమంలోని నవగ్రహాలకు, పంచవృక్షాలకు ప్రత్యేక పూజలు చేసి, యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవదూత గిరి మహారాజ్ ఆయనను సన్మానించి, తీర్థప్రసాదాలను అందజేశారు. మహామండలేశ్వర మహంత్ సిద్ధేశ్వరనందగిరి మహారాజ్, ట్రస్ట్ చెర్మన్ అల్లాడి వీరేషం గుప్తా తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న కేశవరావు

అక్రమంగా మందుల విక్రయం

శివ్వంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎంపీ డాక్టర్లు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాల్సి ఉండగా నిబంధనలు తుంగలో తొక్కుతూ యథేచ్ఛగా మందులు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మందులు అమ్ముతున్నారు. మండల పరిధిలోని కొత్తపేట రూప్లాతండాలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన ఇటుక బట్టీల కార్మికులను ఆసరా చేసుకుని ఏకంగా క్లినిక్‌లోనే మందులను విక్రయిస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ఇదే వ్యక్తి మందులు విక్రయిస్తుండగా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని అతడిని కోర్టుకు హాజరుపరిచారు. అయినా తీరు మార్చుకోకుండా మళ్లీ మందులు విక్రయిస్తున్నాడు. ధనార్జననే ధ్యేయంగా వ్యవహరిస్తున్న ఇలాంటివారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఔషధ నియంత్రణ శాఖ అధికారి చంద్రకళను సంప్రదించగా ఆర్ఎంపీలు ఔషధాలు విక్రయించరాదని లైసెన్సులు లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు చేపడతామన్నారు.



క్లినిక్ లో మందులు

జీతం రూ.12 వేలు.. ఇచ్చేది రూ.6 వేలు

- అడిగితే పనిలో నుంచి తీసివేస్తామని బెదిరింపులు
- ఎఫ్ఏసీహెచ్ హెచ్ఎంపై స్కావెంజర్ల ఆరోపణలు

కొడిపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి తమకు నెలకు రూ.12 వేల జీతం వస్తున్నా.. కేవలం రూ.6 వేలే ఇస్తున్నారని కొడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే స్కావెంజర్‌లు మణెమ్మ, బాలమణి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం వారు విలేకరులతో తమ గోడును వెల్లబోసుకున్నారు. తక్కువ జీతమైనా బతుకుదెరువు కోసం నిత్యం పాఠశాలను శుభ్రం చేస్తున్నామని, తమ కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం 250 నుంచి 500 వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసివారికి వేతనంగా రూ.12 వేలను ప్రభుత్వం అందిస్తున్నది. ఈ పాఠశాలలో 400 పైగా విద్యార్థులు ఉండగా, ఇద్దరు స్కావెంజర్లు పని చేస్తున్నారు. ఈ మేరకు వీరి వేతనం ఏఏపీఎస్ ఖాతాల్లో జమ అవుతున్నాయి. కానీ, ఎఫ్ఏసీహెచ్ ప్రధానోపాధ్యాయురాలు మాత్రం ఒక్కరికి రూ.3వేలు చొప్పున రూ.6వేలే ఇస్తున్నారని, అది కూడా గత డిసెంబర్ వరకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. దీనిపై అడిగితే పని నుంచి తీసి వేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎంఈవోను వివరణ కోరగా ఈ విషయమై తమ దృష్టికి రాలేదని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న స్కావెంజర్‌లు మణెమ్మ, బాలమణి

పేదింటి విద్యా కుసుమం

- గజ్వేల్ వాసికి మొదటి ప్రయత్నంలోనే మూడు ఉద్యోగాలు

గజ్వేల్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చాలా మంది కల. దాని కోసం గంటల తరబడి కష్టపడి చదువుతారు. కానీ కొందరు మాత్రమే ఉద్యోగ సాధనలో సక్సెస్ అవుతారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన పోటీ ఉంది. ఒక్కో పోస్టుకు వేలల్లో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఒక్క ఉద్యోగం సాధించడమే కష్టమనుకుంటున్న ఈ రోజుల్లో ఓ యువకుడు మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలను నిజం చేశాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన తాటి మురళి భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు తాటిసాయి కుమార్ మూడు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించాడు. వీరిది పేద కుటుంబం, గత సంవత్సరం విడుదలైన గ్రూప్-4 ఫలితాలలో ఉద్యోగం సాధించి, గ్రూప్2 ఉద్యోగం వస్తదని వెళ్లలేదు. ఇటీవల విడుదలైన ఫలితాలలో గ్రూప్ 2లో 418 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-3లో 307 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 54వ ర్యాంకు సాధించాడు. 2018 బీటెక్ మెకానికల్ పూర్తి చేశాడు.



సాయికుమార్

నాలుగు ఉద్యోగాలు సాధించిన సల్మాకు సన్మానం

సిద్దిపేట కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వరుసగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సిద్దిపేటకు చెందిన సల్మా నేహను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. తాజాగా జూనియర్ లెక్చరర్‌లో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 76వ ర్యాంకు, మల్టీజోన్‌లో 38వ ర్యాంకు రావటంతో హనుమకొండలో జేఎల్‌గా పోస్టింగ్ వచ్చింది. సల్మానేహాను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానిక్ అయిన భర్త కష్టం, కుటుంబ పరిస్థితి చూసి బాధ్యతతో చదివి నాలుగు ఉద్యోగాలు సంపాదించి ఎంతో మందికి ఆదర్శం నిలిచిందని సల్మానేహాను మెచ్చుకున్నారు. ఎంతో మంది మధ్య తరగతి మహిళలలకు, యువతి, యువకులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు.



మణికంఠేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఉద్యోగ విజేతలకు మంత్రి సన్మానం

హుస్నాబాద్ టౌన్/హుస్నాబాద్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్ 2లో 103వ ర్యాంకు సాధించిన అయిలేని మణికంఠేశ్వర్‌రెడ్డిని, అలాగే గత జనవరిలో వెలువడిన ఫలితాల్లో పంచాయతీ రాజ్ శాఖలో ఏఈ ఉద్యోగం సాధించిన సాయిని ఆదివారం ఆదివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు చిత్తారి రవీందర్, మణికంఠేశ్వర్‌రెడ్డి తండ్రి అయిలేని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాయిని అభినందిస్తున్న మంత్రి పొన్నం

హామీలు అమలు చేస్తారా...

గద్దె దిగుతారా?

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఇస్తారా లేక గద్దె దిగిపోతారో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన విశ్వావసునామ సంవత్సరం పంచాంగం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా జీతాలు ఇవ్వడానికి ఆర్‌బీఐ నుంచి నాలుగు వేల కోట్ల అప్పులు తెస్తున్నామని సీఎం చెబుతున్నారన్నారు. ఆయన మాటలు నమ్మిన తెలంగాణ ప్రజలు బతుకులు పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు అయిందన్నారు. ఆయన వెంట దర్శనం మాస పత్రిక సంపాదకులు, సీనియర్ జర్నలిస్టు మరుమాముల వెంకటరమణశర్మ, గజ్వేల్ బ్రాహ్మణ సంఘ నాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్, నాయకులు కమ్మరి శ్రీనివాస్, మనోహర్, సురేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

- హోలీ పండుగకు ఇంటికొచ్చి అనంత లోకాలకు

మెదక్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : హోలీ పండుగకు ఇంటికి వచ్చిన బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెల్మల నర్సింహులుకు ముగ్గురు కుమార్తెలు. మొదటి కూతురు వివాహం కాగా రెండో అమ్మాయి వెల్మల నందిని (23) మేడ్చల్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. రెండు రోజుల క్రితం హోలీ పండగ సెలవులు ఇవ్వడంతో నందిని ఇంటికి వచ్చింది. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లోపలి నుంచి తలుపు గడియ వేసుకొని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని అదే వీధిలో ఉన్న ఒకరు గమనించి గడియ బద్దలు కొట్టి ఆమెను దింపినప్పటికీ అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ బాలరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి. కేసును దర్యాప్తులో ఉంది.



నందిని (ఫైల్)

బాలికపై బాలుడి లైంగికదాడి

- బాలికను సఖీ సెంటర్‌కు తరలింపు
- దర్యాప్తు చేస్తున్న పటాన్‌చెరు పోలీసులు

పటాన్‌చెరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : బాలికపై 17 ఏళ్ల బాలుడు లైంగికదాడికి ఒడిగట్టిన సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ బస్తీలో నివాసం ఉంటున్న బాలిక(10)పై జరిగిన దారుణంపై తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వారు అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని కుమారుడు మాయమాటలు చెప్పి బాలికపై లైంగికదాడికి ఒడిగట్టాడు. బాలిక అస్వస్థకు గురికావడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు అడగడంతో విషయం చెప్పింది. వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత బాలికను సఖీ సెంటర్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.

తవ్వేయ్.. అమ్మేయ్..



జిన్నారం మండలం గడ్డపోతారం పరిధి 79 సర్వే నంబర్‌లోని సీలింగ్ భూమిలో మట్టి తవ్వకాలు

- జిన్నారం మండలంలో జోరుగా మట్టి దందా
- ప్రభుత్వ భూములు, కుంటల నుంచి రాత్రుల్లో తోడివేత
- అక్రమార్కులకు సిరులు.. ప్రభుత్వ ఆదాయానికి గండి

జిన్నారం, మార్చి, 16 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలంలోని పలు గ్రామాల శివారు ప్రాంతాలు, కుంటలు, ప్రభుత్వ భూముల నుంచి మట్టి అక్రమ రవాణా దందా జోరుగా సాగుతున్నది. రాత్రి వేళల్లో జేసీబీలు, టిప్పర్లతో నిత్యం యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. లక్షల రూపాయలు విలువ చేసే మట్టిని అక్రమార్కులు గుట్టుచప్పుడుకాకుండా రాత్రికి రాత్రే పరిశ్రమలు, నగర శివారు ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామస్థాయిలో నిఘా వ్యవస్థ సరిగా లేకపోవటంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతున్నది.

ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు

జిన్నారం మండలంలో నిత్యం ఏదో ఒక చోట మట్టి అక్రమ దందా జరుగుతుంది. గడ్డపోతారం పరిధిలోని 79 సర్వే నంబర్‌లోని భైరవ కుంట, సీలింగ్ భూమిలో నెల రోజులుగా వందల సంఖ్యలో టిప్పర్ల మట్టిని తరలిస్తున్నారు. దీంతో కుంటలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వావిలాల శివారులో 190 సర్వే నంబర్‌లో ఇటీవల టీఎస్ఐఐసీకి కేటాయించిన స్థలంలో భారీగా తవ్వకాలు జరిపారు. రాళ్లకత్వ పరిధి 286 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలోనూ మట్టి దందా సాగుతుంది. కాజీపల్లి, మాదారం, జిన్నారం, కొడకంచి ప్రాంతాల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు.

రోజుకు రూ.25 లక్షల విలువైన మట్టి !

మట్టి దందా అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్నది. ముఖ్యంగా హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన జిన్నారం మండలం నుంచి నిత్యం 25లక్షల విలువ గల మట్టి రవాణా జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. నగర శివారులో నిర్మాణ రంగం, అపార్ట్‌మెంట్లకు మట్టి సరఫరాకు భారీగా డిమాండ్ ఉన్నది. అదేవిధంగా స్థానికంగా ఉన్న పరిశ్రమలు, ఇటుక బట్టీలకు జోరుగా మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఒక్కో టిప్పర్ మట్టి రూ.6 వేల నుంచి 8 వేల వరకు ధర పలుకుతుండగా, రాత్రికి రాత్రే ఈ వ్యవహారం లక్షల్లో ఆర్జిస్తున్నారు. మట్టి అక్రమ దందాతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్నది. ఇక గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖకు నిఘా వ్యవస్థ లేక పోవటం, స్థానిక సంస్థలు అక్రమ మట్టి తరలింపును అరికట్టడం తమ పని కాదని భావించటంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు.



విశేష పూలమాలల అలంకరణలో మల్లన్న



భక్తజనంతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

9వ వారం.. జన సందోహం

- పట్నాలు రచించి, బోనాలు నివేదించిన భక్తులు

చేర్యాల, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా తొమ్మిదవ వారమైన ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. గంగిరేగు చెట్టుకు ముడుపులుకట్టారు. స్వామివారి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. ఆలయ ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చేర్యాల సీఐ ఎల్. శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పట్నం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

శిథిలావస్థలో శాఖా గ్రంథాలయం

- దినపత్రికలతోనే సరిపెడుతున్న వైనం
- పోటీ పరీక్షలకు దూరమవుతున్న యువత



సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో శిథిలావస్థకు చేరిన శాఖ గ్రంథాలయం

సంగారెడ్డి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ లోపంతో శాఖా గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకున్నది. సంగారెడ్డి మండలంలోనే మేజర్ గ్రామపంచాయతీ అయిన (ఈశ్వరాపురం) ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలో 4 వేల వరకు జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో విద్యావంతులు అధికంగా ఉండడంతో 40 ఏళ్ల క్రితం శాఖ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లోనే ఈ గ్రంథాలయంలో దినపత్రికలతో పాటు పిల్లలకు విజ్ఞానాన్ని పంచే బొమ్మల కథల పుస్తకాలు, దేశపౌరుల జీవిత చరిత్ర తెలిపే గ్రంథాలు, వార, మాస పత్రికలు అందుబాటులో ఉండేవి. కాలక్రమేనా గ్రంథాలయాన్ని పట్టించుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. గ్రామంలోని యువత గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4, ఎస్ఐ, పోటీ పరీక్షలు సన్నద్ధమయ్యేందుకు పుస్తకాలు అందుబాటులో ఉండకపోవడంతో సంగారెడ్డిలోని జిల్లా గ్రంథాలయానికి వెళ్లి చదువుకుంటున్నారు. పర్యవేక్షణ లేక ఎప్పుడూ తాళం వేసి ఉండడంతో గ్రంథాలయానికి వచ్చేవారు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. గ్రంథాలయాన్ని గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి తెరిచి శుభ్రం చేసి వెళ్తాడు. ఇప్పటికైనా ఈ గ్రంథాలయంపై దృష్టిసారించి మరమ్మతులు చేయించి దినపత్రికలతో పాటు యువతీ, యువకులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాంగ్రెస్ అంటేనే కరెంట్ కష్టాలు : ఎమ్మెల్యే



నార్సింగిలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరన్నరలోనే రైతులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయని, కాంగ్రెస్ అంటేనే కరెంట్ కష్టాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం నార్సింగి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బ్రేక్ డౌన్ కారణంగా నార్సింగిల్ విద్యుత్ సమస్య తలెత్తడంతో విషయం తెలుసుకున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. రైతులకు యాసంగి పంటకు విద్యుత్ సమస్య రాకుండా చూడాలని విద్యుత్ అధికారులకు ఆదేశించారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం నార్సింగిలోని ఎన్నారై జీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మైలారం బాబు, చేగుంట మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితానికి కిండర్ గార్డెన్ పునాది

- ఎడ్యుకేషన్ ట్రైనర్ డా.దీపదేశ్‌పాండే



పట్టాలు పొందిన విద్యార్థులతో ఎడ్యుకేషన్ ట్రైనర్ డా.దీపదేశ్‌పాండే, స్కూల్ యాజమాన్యం

మెదక్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కిండర్ గార్డెన్ విద్య అనేది విద్యార్థి జీవితానికి పునాది రాయి లాటిందని ఎడ్యుకేషన్ ట్రైనర్ డా. దీపదేశ్‌పాండే పేర్కొన్నారు. స్థానిక సిద్ధార్థ్ విద్యాసంస్థల్లో ఆదివారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు నేర్పాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ బుక్స్ పబ్లిషర్ సాయికృష్ణ, విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్‌చౌదరి, ప్రిన్సిపల్ సంధ్యారాణి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఇన్‌చార్జిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శివాయపల్లిలో పోచమ్మల జాతర



మహిళలతో కలిసి బోనమెత్తిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల పరిధిలోని శివాయిపల్లి గ్రామంలో ఆదివారం నల్ల, మత్తడి పోచమ్మలకు బోనాలు సమర్పించారు. ప్రతీ సంవత్సరం హోలీ నుంచి ప్రారంభమయ్యే జాతర నాలుగురోజుల పాటు జరుపుకునే ఆనవాయితీగా వస్తుందని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు పూజలు చేయగా.. మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి మహిళలతో కలిసిన బోనమెత్తారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిష్టయ్య, మాజీ సర్పంచ్ రవీందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీరప్ప ఉత్సవాలు

పుల్‌కల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోడూరులో వెలసిన బీరప్ప కామరతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి ఉత్సవాలు 12వ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బియ్యం సుంకించుట, లగ్నం, బోనాలు ఊరేగింపు నిర్వహించారు. బీరప్ప ఉత్సవాల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర రాజనరసింహ ఆశీస్సులతో స్వర్గీయ రామలింగు పోచయ్య జ్ఞాపకార్థం ఆయన తనయుడు రామలింగు బాలయ్య అధ్వర్యంలో సహస్ర ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

పెద్దమ్మగూడెంలో మల్లన్న జాతర

జిన్నారం, మార్చి, 16 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెంలో మల్లన్న ఆలయం జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లన్నస్వామి కల్యాణోత్సవం, జాతర కార్యక్రమాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై.. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

చిరుధాన్యాలకు మరింత డిమాండ్



అల్గోల్‌లో పంటపొలాలను పరిశీలిస్తున్న నర్సాపూర్ రైతులు

సంగారెడ్డి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల్లోనే మెరుగైన పోషకాలుంటాయని డీడీఎస్ మహిళా సంఘాల రైతులు పేర్కొన్నారు. శని, ఆదివారం పట్టణంలోని పస్తాపూర్‌లో గల డీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యకలాపాల గురించి నర్సాపూర్‌కు చెందిన రైతులు పరిశీలించారు. అందులో భాగంగా అల్గోల్ గ్రామంలో డీడీఎస్ మహిళా రైతులు సాగుచేస్తున్న చిరుధాన్యాల పంటలను, ఝరాసంగం మండలం మాచ్నూర్‌లో గల రేడియో స్టేషన్‌ను, పట్టణంలోని పస్తాపూర్‌లో గల సంఘం దుకాణం, డీడీఎస్ హోటల్ (కేఫే ఎథ్నిక్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీఎస్ మహిళా రైతులు మాట్లాడుతూ డీడీఎస్ ఆధ్వర్యంలో 40 ఏళ్లుగా చిరుధాన్యాలను సాగుచేస్తూ.. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నామన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

సంగారెడ్డి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీశైలం గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శత కలశార్చన కార్యక్రమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అరుణ్ గురుస్వామి అధ్వర్యంలో మహాపడి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి జయప్రకాష్, శ్రీశైలం గౌడ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ఎత్తేసే వరకు ఆందోళనలు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్



దీక్షలో మురళీధర్‌యాదవ్, నాయకులు

నర్సాపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డు విషయంలో ఆందోళన విరమించేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ స్పష్టం చేశారు. నర్సాపూర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలో ఆదివారం ఆయన పాల్గొని మద్దతు తెలిపి మాట్లాడారు. ఇంత ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, ఉపాధ్యక్షుడు బుచ్చేస్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ యాదగిరి, దిగంబర్, కొండికుమార్, సుబ్రహ్మణ్యంతో పాటు 4వ వార్డుకు చెందిన పలువురు పాల్గొన్నారు.

కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం



మెదక్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



నర్సాపూర్‌లో కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఏకవచనంతో సంబోధించడం బీఆర్ఎస్ వాళ్ల హేయమైన చర్య అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)



తూప్రాన్‌లో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం



కంది‌లోని జాతీయ రహదారిపై కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు



శివ్వంపేటలో జగదీష్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సంగారెడ్డిలో ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

న్యూస్ బాక్స్

దుకాణాల లీజు కోసం బహిరంగ వేలం

సంగారెడ్డి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలో లోపలికోట హనుమాన్ మందిరానికి చెందిన 4 దుకాణాలను లీజు ఇచ్చేందుకు సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మందిరం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రుద్రప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు రూ.50 వేలను డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

'తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకోవాలి'

పటాన్‌చెరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్ష పార్టీల వెన్నుదన్నుతో సీఎం రేవంత్‌రెడ్డిపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు మతిన్, అతిక్, సంజీవరెడ్డి ఆదివారం పటాన్‌చెరు సీఐ వినాయకరెడ్డికి ఫిర్యాదు చేశారు.

పొట్టి శ్రీరాములు జయంతి

నారాయణఖేడ్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 126వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములుచౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ధర్నాలో పాల్గొనేందుకు ఢిల్లీకి..

నారాయణఖేడ్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత జీవితబీమా ఏజెంట్ల ఐకాస ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 19న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు ఖేడ్ ప్రాంత బీమా ఏజెంట్లు ఆదివారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇందులో బీమా ఏజెంట్ల సంఘం బాధ్యులు వెంకటేశం, సంగారెడ్డి, కాశీనాథ్, దుర్గయ్య, రాంచంద్రం, తుకారం ఉన్నారు.

రూ.1.42 లక్షలు పలికిన భూముల కౌలు

కంగ్టి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలోని ప్రసిద్ధ రామాలయానికి చెందిన వ్యవసాయ భూముల కౌలు కోసం ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఏడాది కౌలుకుగాను కంగ్టికి చెందిన గంపల్లి నర్సింలు రూ.1.42 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గోవింద్ ప్రసాద్, నగేష్‌గౌడ్, గంగాధర్, మనోజ్‌పాటిల్ పాల్గొన్నారు.

'విద్యారంగానికి నిధులు కేటాయించాలి'

సంగారెడ్డి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, జ్ఞానమంజరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కౌడిపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లోంచి వెళ్లిన వ్యక్తి చెరువులో పడి మృతిచెందాడు. కౌడిపల్లి మండలం కొత్తచెరువుతండాక చెందిన గుగ్లోత్ లక్ష్మణ్(32) ఆదివారం ఉదయం ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో మహ్మద్‌నగర్ చెరువులో మధ్యాహ్నం శవమై కనిపించాడు. తర భర్త మృతికి మహ్మద్‌నగర్‌కు చెందిన సురేందర్‌రెడ్డి కారణమని భార్య సునీత అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

మెదక్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మహిళ అదృశ్యమైన సంఘటన చిన్నశంకరంపేట మండలం బాగిర్తిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. నిజాంపేట మండలం రజాక్‌పల్లి గ్రామానికి చెందిన బాలమల్లవ్వ వారంరోజుల క్రితం బాగిర్తిపల్లిలో బీరప్ప జాతర కోసం వచ్చింది. నాలుగురోజుల క్రితం ఇంటికి వెళ్తున్నాని చెప్పి వెళ్లింది. గ్రామానికి వెళ్లలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు వజ్జ శ్రీరామ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712657937 నంబరుకు సమాచారమందించాలన్నారు.

పారిశుధ్య కార్మికుడు మృతి

చేగుంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పారిశుధ్య కార్మికుడు ఆదివారం మృతిచెందాడు. చేగుంట మండల కేంద్రానికి చెందిన ఎర్ర రమేష్(38) చేగుంట పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమేష్ మృతిచెందాడు. మృతుడికి భార్య కల్యాణి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రమేష్ దహన సంస్కారాలకు పంచాయతీ కార్యదర్శి నరేష్ రూ.5 వేల అందజేశారు. అలాగే మాజీ సర్పంచ్ మంచుకట్ల శ్రీనివాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐత పరంజ్యోతి కుటుంబసభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు.

14 బృందాలతో ఆస్తిపన్ను వసూలు



పన్ను వసూలు చేస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

ఐడీఏబొల్లారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు జరుపుతున్న నిత్య పర్యవేక్షణ ఫలితాలు ఇస్తున్నాయి. ఆదివారం సైతం ఐడీఏబొల్లారం పట్టణంలో 14 బృందాలతో పురపాలక సిబ్బంది ఆస్తిపన్ను వసూలు చేశారు. నోటీసులు జారీచేసినా పట్టించుకోకపోవడంతో బాలాజీ శక్తి సూపర్‌మార్కెట్‌ను సీజ్‌చేశారు. మధ్యాహ్నం తరువాత రూ.42 వేల పన్ను చెల్లించారు. మాజీ కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి స్వచ్ఛందంగా పన్ను చెల్లించారు. ఒక్కరోజులో రూ.12.39 లక్షలు వసూలు చేయగలిగామని కమిషనర్ చెప్పారు. రూ.16.25 కోట్లు రావాల్సి ఉండగా.. ఇప్పటికే రూ.11.9 కోట్లు వసూళ్లు అయ్యాయి. మిగిలిన రూ.4.34 కోట్లు ఈనెల 23లోపు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆస్తిపన్ను చెల్లించని వారి జాబితా తో కఠినంగా వ్యవహరిస్తామని కమిషనర్ చెప్పారు.

'సెయింట్ ఆంథోనీస్'లో విద్యార్థులకు వీడ్కోలు



వీడ్కోలు కార్యక్రమంలో సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు

సంగారెడ్డి క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆంథోనీస్ విద్యాసంస్థల చైర్మన్ ఆంథోనీరెడ్డి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ శక్తి సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్ బంగారుమయం కావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

నీరా కేఫ్‌ను టాడీ కార్పొరేషన్‌కు అప్పగించడం కేజీకేఎస్ విజయం

సంగారెడ్డి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నీరా కేఫ్‌ను టాడీ కార్పొరేషన్‌కు అప్పగించడం కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) చేసిన పోరాట విజయమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరా కేఫ్‌ను టాడీ కార్పొరేషన్‌కు అప్పగించాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కార్పొరేషన్ ఎండీ ఉదయ్‌ప్రకాష్‌కు విన్నవించామని గుర్తుచేశారు. ధర్నాలు, రాష్ట్ర సదస్సులతో ప్రభుత్వం దిగివచ్చి నీరాకేఫ్‌ను టాడి కార్పొరేషన్‌కు అప్పగించేందుకు అంగీకరించిందన్నారు. ఈ సమావేశంలో కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చౌటకూర్‌లో ఘనంగా ఆశం దస్తగిర్ ఉర్సు

పుల్‌కల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం చౌటకూర్‌లో వెలసిన ఆశం దస్తగిర్ దర్గా 12వ ఉర్సు ఆదివారం ఘనంగా జరిగింది. దర్గా నిర్వాహకుడు అహ్మద్ అలీ ఉర్ఫ్ నారాయణగౌడ్ గంధం ఊరేగించారు. ఈ సందర్భంగా ఖవ్వాలి, ఫాతహ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నదాన వితరణ చేపట్టారు. ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాలతో పలు పట్టణాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలకు హాజరైన అన్నసాగర్ పీఠాధిపతి ఖలీల్‌హుస్సేన్, జోగిపేటకు చెందిన ప్రముఖ అధ్యాత్మిక గురువు డాక్టర్ రజాక్ అలీ భక్తులకు సందేశమిచ్చారు.

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా గుండు లక్ష్మణ్



గుండు లక్ష్మణ్

కల్హేర్, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామానికి చెందిన గుండు లక్ష్మణ్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆదివారం నియామకమయ్యారు. ప్రస్తుతం మండల పరిధిలోని మార్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గజిటెడ్ హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. 1989లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన ఆయన మారుమూల ప్రాంతాల్లోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని పీఆర్టీయూ భవన్‌లో లక్ష్మణ్ చేత రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కలియుగ క్రిష్ణుడే చైతన్యమహాప్రభు

జహీరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కలియుగ క్రిష్ణుడే చైతన్యమహాప్రభని ఇస్కాన్‌టెంపుల్ అక్షయపాత్ర బాధ్యులు విభీషన్ ప్రభు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పెద్దమ్మ ఆలయం వద్ద చైతన్యమహాప్రభు జయంతిని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా పట్టణ ప్రముఖులు, భక్తులు, అభిమానులు ఆడుతూ.. పాడుతూ సందడి చేశారు. ముందుగా హమాలీ కాలనీ, తదితర ప్రాంతాల్లో సంగీతవాయిద్యాల మధ్య క్రిష్ణ కీర్తనలు ఆలపించారు.

మాదిగలకు న్యాయం చేయడం ప్రభుత్వం బాధ్యత

సంగారెడ్డి/మెదక్ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మాదిగలకు న్యాయం చేయడం ప్రభుత్వం బాధ్యత అని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న నిరసన దీక్ష ఆదివారం నాటికి 5వ రోజుకు చేరుకుంది. మెదక్ పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 3వ రోజుకు చేరింది.

సరస్వతీ శిశుమందిర్‌లో ఖేల్ కూద్ పోటీలు

సంగారెడ్డి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ సమీపంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు ఖేల్ కూద్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా లాంగ్‌జంప్, హైజంప్, ఖోఖో తదితర ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూనవేణు గోపాలకృష్ణ, అంజనేయులు, విభాగ్ అధ్యక్షుడు రాజయ్య పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

హత్నూర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామంలో పోచమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుడు, శివసత్తుల నృత్యాల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు.

దుర్గా భవానీమాత వార్షికోత్సవం ప్రారంభం

సంగారెడ్డి రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఈశ్వరాపుర (ఇస్మాయిల్‌ఖాన్‌పేట) గ్రామంలోని దుర్గాభవానీ మహాక్షేత్రం ఆలయ 24వ వార్షికోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ఆలయ ధర్మాధికారి రాధాకృష్ణమూర్తిశర్మ పర్యవేక్షణలో అమ్మవారిని ఆలయ ప్రధాన అర్చకులు రవికుమార్‌శర్మ, దత్తాత్రేయశర్మ నూతన వస్త్రాలు, పూలమాలలతో అందంగా ముస్తాబు చేశారు. ఉదయం వేదపండితులు, రుత్వికులతో మహాగణపతి పూజ, అఖండ దీపస్థాపనము, దేవతావహనము, అగ్నిప్రతిష్ఠ, సహస్ర లింగార్చన, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాద వితరణ చేశారు.